## మెట్రో రైళ్లపై ఆ ప్రకటనలు తీసేయండి: ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి



**హైదరాబాద్:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రకటనలపై మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పందించారు. కొన్ని మెట్రో రైళ్లపై బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనలు ఉన్నాయన్న అంశం తన దృష్టికి వచ్చింద న్నారు. ఆ ప్రకటనలు తక్షణమే తొలగించాలని ఎల్ అండ్‌టీ, సంబంధిత అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలను ఆదేశించామని పేర్కొన్నారు. గురువారం రాత్రికే ప్రకటనలను పూర్తిగా తీసేయాలని ఆదేశించామని మెట్రో ఎండీ తెలిపారు.

## రానున్న రెండు రోజుల్లో తెలంగాణకు వర్ష సూచన



**హైదరాబాద్:** ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వివరించారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒకటి, రెండు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని వివరించారు.

## ఎల్2: ఎంపురాన్' సినిమాలో ఓ మ్యాజిక్ ఉంది: మోహన్‌లాల్

**హైదరాబాద్:** 'ఎల్2: ఎంపురాన్' సినిమా ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతి నిస్తుందని మలయాళ సూపర్‌స్టార్ మోహన్ లాల్ అన్నారు. మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబోలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. మార్చి 27న ప్రపంచ వ్యాప్తంగా మలయాళంతోపాటు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం సినిమా ట్రైలర్‌ను ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ.. "ఈ పాన్ ఇండియా సినిమాను రూపొందించేందుకు ఏడేళ్లపాటు శ్రమించామన్నారు. ఈ భారీ చిత్రాన్ని గొప్పగా తెరకెక్కించిన పృథ్వీరాజ్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఇదొక ట్రయాలజీ మూవీ. ఇప్పటికే 'లూసిఫర్' సినిమా వచ్చింది. మార్చి 27న 'ఎల్2: ఎంపురాన్' రానుంది. మరో సినిమాను రూపొందించాల్సి ఉంది. మలయాళ సినీ ఇండస్ట్రీ నుంచి వస్తున్న తొలి ఐమ్యాక్స్ ఫార్మాట్ సినిమా ఇది. ఈ చిత్రానికి వస్తున్న ఆదరణ చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. ఈ మూవీలో ఓ మ్యాజిక్ ఉంది. ప్రేక్షకులతో కలిసి ఈ సినిమా చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు. దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ "సినిమాను తెరకెక్కించడం అంత సులువు కాదు. మరీ ముఖ్యంగా 'ఎల్2: ఎంపురాన్' లాంటి సినిమాలు చేయడం మామూలు విషయం కాదు. లూసిఫర్ చిత్రాన్ని మూడు భాగాలుగా రూపొందించాలనుకున్నప్పుడు.. తొలి భాగం మంచి విజయాన్ని సాధించింది. దీంతో రెండో భాగాన్ని ఎలా తెరకెక్కించాలన్న దానిపై కసరత్తు చేశా. 2022లో మోహన్‌లాల్‌ను ఆయన ఆఫీసులో కలిసి తొలిసారి 'ఎల్2: ఎంపురాన్' కథను వివరించాను.

# దేశాన్ని విద్వేష భారత్‌గా మారుస్తున్న పాలకులు

- చావా సినిమా డైరెక్టర్, హీరోలపై కేసులు నమోదు చేయాలి
- మత విద్వేష విషయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం
- సోషల్ మీడియా నిర్వాహకులపై చర్యలు చేపట్టాలి
- సామాజికవేత్త కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనీఫ్ అహ్మద్



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** శాంతి, సమైక్యత, సమగ్రత, లౌకిక భావాలు కలిగిన భారతదేశంలో పాలకులు ఉద్దేశ్య పూర్వకంగా మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ ఆరోపించారు. మహబూబ్నగర్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పండి దేశ చరిత్రను ఉద్దేశపూర్వకంగా కొంతమంది మతోన్మాదులు వక్రీకరిస్తూ ముస్లింలపై ముస్లిం రాజులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బాబరు అక్బర్ ఔరంగజేబు నువ్వంటే అనేక మంది ముస్లిం రాజులు ఈ దేశాన్ని మతసామరస్యంతో లౌకిక భావనలతో పరిపాలన చేశారని తెలిపారు. బ్రిటిషర్లను అడ్డుకోవడంలో ఆరోజుల్లో ఉలేమాలు తమ ప్రాణాలకు తెగించి పోరాటం చేశారని చెప్పారు. ఆ క్రమంలో 51625 మంది ఉలేమాలు బ్రిటీషర్ల చేత ఉరి తీయబడ్డారని చెప్పారు. ముస్లింలు ఈ దేశ మూలవాసులని తెలిపారు. ఈ దేశంలో ఉన్న ముస్లింలపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. మసీదులను తవ్వడం, దర్గాలను తవ్వడం, ఇప్పటివరకు జరిగిందని ఇకమీదట సమాధుల పునాదులను తవ్వడం, ఔరంగజేబు సమాధిపై రాద్ధాంతం చేయడం చూస్తే మతోన్మాద చర్యలకు హరాకాష్టగా మారిందని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నారని శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మనమంతా మనుషులుగా పుట్టామని మానవత్వాన్ని కలిగి ఉండాలని హితవు పలికారు. ముస్లింలపై దాడులు దళితులపై దాడులు లౌకికవాదులపై దాడులు పై మేధావుల పై దాడులు, దేశం ఎక్కడ పోతుందని మనవీయ విలువలు ఎటు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దేశంలోని జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీలు మేధావులు ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు లౌకిక విలువలకు కట్టుబడి ఉండాలని, జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా హనీఫ్ అహ్మద్ కోరారు.

## వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి



**విశ్వంభర భూపాలపల్లి** వేసవిలో నియోజక వర్గంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్యరాకుండా చూడాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూవేసవిని దృష్టిలో ఉంచుకొని కాటారం, భూపాలపల్లి డివిజన్లలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో 30 బోర్లు నిర్మానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని అవసరం ఉన్న గ్రామాలలో ఏర్పాటు చేయాలని తెలిపారు. కాటారం సబ్ డివిజన్ హెడ్ క్వార్టర్స్ లో మినీ స్టేడియం, చిల్డ్రన్ పార్కు నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని తెలిపారు. నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామాలలో సోలార్ పవర్ ద్వారా నీటి మోటార్ల ఏర్పాటుకు ప్రతి పాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సి.ఆర్.ఆర్ ద్వారా ఉట్ల పోచమ్మ , దామర కుంట నుండి మానేరుకు వెళ్ళే రోడ్డు, ఒడుపులవంచ గ్రామాలలో నాలుగు రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని వాటి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ.సి.డి.పి నిధుల ద్వారా నిర్మాణంలో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో మంజూరు చేసిన కూరగాయల మార్కెట్, కమ్యూనిటీ హాలు నిర్మాణాలను టెండర్లను పిలిచి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. కాటరం సబ్ డివిజన్ కు అంబులెన్సు, వైకుంఠ రథాలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. కాటరం సబ్ డివిజన్ కేంద్రం, మహదేవ్ పూర్ మండల కేంద్రాల్లో ఆర్.టి.సి బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు పంపాలని ఆదేశించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని చెరువుల నిర్మాణం పనులు భూసేకరణ త్వరిత గతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మెన్ అయితా ప్రకాశ్ రెడ్డి, ఎస్పీ కిరణ్ ఖరె, సబ్ కలెక్టర్ మయంక్ సింగ్, డిఆర్డిఓ నరేష్, డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో.. మంత్రులు సహా 48 మంది నేతలపై 'హనీ ట్రాప్'!



**బెంగుళూర్:** కర్ణాటకలో మంత్రులు సహా అనేకమందిపై 'హనీ ట్రాప్' వ్యవహారం అక్కడి రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. అనేక మంది మంత్రులు సహా ముఖ్య నేతలే లక్ష్యంగా ఈ వలపు వల ఘటనలు కొనసాగు తున్నాయని తెలిసింది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. దీనిపై విచారణ జరిపించాలని అధికార, విపక్ష పార్టీ సభ్యులు డిమాండ్ చేసిన నేపథ్యంలో అందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### 48 మంది వీడియోలు..

రాష్ట్రానికి చెందిన అనేక మంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందిన వారు ఈ బాధితుల్లో ఉన్నారని అన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తు అవసరమన్న ఆయన.. దీనిపై హోంశాఖకు ఫిర్యాదు చేస్తానన్నారు. దీని వెనక ఎవరు ఉన్నారనే విషయం బయటపడుతుందని, ప్రజలకు కూడా ఈ విషయాలు తెలియాలని మంత్రి రాజన్న స్పష్టం చేశారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని అన్నారు. ఈ తరహా ఘటనలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఫిర్యాదు చేయాలని సదరు మంత్రికి సూచించామని, వెంటనే దర్యాప్తు మొదలు పెడతామన్నారు. మరోవైపు ఇదే వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ.. ఎవరినైనా అరెస్టు చేశారో లేదోనన్న విషయం తనకు తెలియదన్నారు. దర్యాప్తు పూర్తయితే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

## ఓ నగరాన్ని తలపిస్తోన్న.. చైనా 'మెగా ఫ్యాక్టరీ'



**చైనా:** ఓ నగరాన్ని తలపించేలా చైనాలో ఓ ఫ్యాక్టరీ భారీ విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతోందట. ఇప్పటికే అనేక నిర్మాణాలు పూర్తికాగా.. మరిన్ని దశల్లో విస్తరణ కొనసాగించనుందని తెలిసింది. నిర్మాణం పూర్తయితే దీని విస్తీర్ణం అమెరికాలోని ఓ నగరం కంటే పెద్దగా ఉంటుందని చెప్పడం గమనార్హం. ఇందుకు సంబంధించిన ఓ డ్రోన్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చైనాలో అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ బీవైడీ.. హెనాన్ ప్రావిన్సులోని జెంగ్‌ఝౌలో ఓ ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఎనిమిది దశల్లో దీనిని పూర్తి చేసేందుకు ప్రణాళికలు వేసుకుందట. దాదాపు 32వేల ఎకరాల్లో నిర్మాణం చేపడుతుందని తెలిసింది. బ్లాక్‌ల వారీగా అనేక భవనాలు, ఓ ఫుట్ బాల్ మైదానం, టెన్నిస్ కోర్టులు.. వీటన్నింటినీ అనుసంధానం చేస్తూ రోడ్లు.. ఇలా అనేక సౌకర్యాలు కల్పించేందుకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తైతే అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కో నగరం కంటే పెద్దగా కనిపిస్తుందని అంచనా. చైనాలో అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన బీవైడీలో దాదాపు 9లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. రానున్న మూడు నెలల్లో మరో రెండు లక్షల మందిని నియమించుకునేందుకు సన్నాహాలు చేస్తోందని స్థానిక మీడియా కథనాలు చెబుతున్నాయి. ఒక్క జెంగ్‌ఝౌ మెగా ఫ్యాక్టరీలో దాదాపు 60 వేల మంది పనిచేస్తున్నారని తెలిసింది. వేలాది మంది కార్మికులు అక్కడే నివసిస్తుండడంతో అదో నగరంగా మారిపోయిందని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి.

## రెండేళ్ల బిడ్డ పక్కనేఉన్నా.. మద్యంమత్తులో కారు డ్రైవ్ చేసిన మేయర్



**బెంగుళూర్:** బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఓ మేయర్ విచక్షణారహితంగా వ్యవహరించారు. తన రెండేళ్ల బిడ్డ కారులో ఉన్నా పట్టించుకోకుండా మద్యంమత్తులోనే డ్రైవింగ్ చేశారు. ఆ దృశ్యాలు వైరల్ కావడంతో చివరకు జైలు పాలయ్యారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. న్యూజెర్సీ మేయర్ గినాలాప్లాసా మద్యం మత్తులో వాహనం నడిపి, అరెస్టయ్యారు. ఆమె మద్యం సేవించి, డేకేర్ సెంటర్ నుంచి తన రెండేళ్ల కుమారుడిని ఇంటికి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆమె రోడ్డుపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేశారు. తృటిలో పెద్ద ప్రమాదాన్ని తప్పించుకున్నారు. ఈ దృశ్యాలన్నింటిని ప్రత్యక్ష సాక్షి ఒకరు తన కెమెరాలో బంధించారు. ఆ క్లిప్‌లో కారుసీటులో పిల్లాడు కనిపించాడు. ఆ దృశ్యాలు తమ దృష్టికి చేరడంతో పోలీసులు మేయర్ కారును అనుసరించి, ఆమె ఇంటికి చేరుకున్నారు. ఆమె కారులో మద్యం సీసాను గుర్తించారు. ఆల్కహాల్ టెస్టులో పాజిటివ్ రావడంతో అరెస్టు చేశారు. అయితే మేయర్ భర్తమాత్రం ఆమెను వెనకేసుకొచ్చారు. ఆ పిల్లాడిని ఆమె నుంచి దూరంగా ఉంచండి అంటూ వస్తోన్న విమర్శలను తోసిపుచ్చారు. "లక్షలాది మంది అమెరికన్లు ఈ వ్యసనంతో పోరాడుతున్నారు. వారికి ఎలాంటి సహాయం లభించడం లేదు. ఆ వ్యసనాన్ని వదిలించుకోవడానికి గినా చాలా కష్టపడింది. ఇప్పుడు ఆమెకు అవసరమైన సహాయం అందుతోంది. దయచేసి విమర్శలు ఆపండి. ఇతరులకు సహాయం చేయాలనే ఆమె అభిరుచిని గుర్తించండి. ఆమె చేసిన మంచిని మర్చిపోవద్దు" అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాటం తోనే బీసీ బిల్లు




**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీల గొంతుకై కామారెడ్డి డిక్లరేషన్ 42% డిక్లరేషన్ చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర మొత్తం రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ బీసీలను ఏకం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన సందర్భంగా ఉభయ సభలలో బీసీ బిల్లు కాంగ్రెస్ పార్టీ పెట్టడం జరిగింది. ఎమ్మెల్సీ కవిత సాధించిన విజయానికి నేడు ఎల్బీనగర్ నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుడు కుమ్మర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏలుకొండ రామ్ కోటి ప్రజాపతి ఆధ్వర్యంలోఎల్బీనగర్ నియోజక వర్గంలో బీసీ కుల బాంధవులందరం కలిసి కవితకు పాలాభిషేకం చేయడం జరిగింది. కవిత ఎల్లప్పుడూ మా బీసీ కులాలకు ఎల్లప్పుడు తోడుగా ఉంటు ఏ ఉద్యమంలో నైనా తోడుగా ఉండాలని తెలిపారు.గిరి, అరుణ్, వేణు, గోపి, శంకర్, నాని, సుధాకర్, గాలయ్య పాల్గొన్నారు.

## డా. లోహియా సామాజిక న్యాయ పురస్కారానికి డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావుకు ఎంపిక



**విశ్వంభర హైదరాబాద్:** ఆదిలీలా ఫౌండేషన్, న్యూఢిల్లీ ప్రథమంగా ప్రదానం చేయనున్న డా. రామ్ మనోహర్ లోహియా సామాజిక న్యాయ పురస్కారానికి డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఎంపికయ్యారు. ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు డా. ఎస్. ఆదినారాయణ ఈ విషయాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా అనేక మంది అభ్యర్థులు ఈ పురస్కారానికి నామినేషన్ సమర్పించగా, జ్యూరీ కమిటీ విస్తృత పరిశీలన అనంతరం, సామాజిక న్యాయం కోసం సుదీర్ఘకాలంగా విశేష కృషి చేస్తున్న డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.బీసీ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమిస్తూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిబద్ధతతో కృషి చేస్తున్న డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ రెండో ఛైర్మన్‌గా సేవలందించారు.

## ఎంఎఫ్ హుసేన్ పెయింటింగ్‌కు వేలంలో రూ.118కోట్లు!



**న్యూయార్క్:** ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్టీ . న్యూయార్క్‌లో తాజాగా నిర్వహించిన వేలంలో హుస్సేన్ గీసిన 'అన్‌టైటిల్డ్ (గ్రామ్ యాత్ర)' కళాఖండం 13.8మిలియన్ డాలర్ల (రూ.118 కోట్లు) కు అమ్ముడు పోయింది. దీంతో ఆధునిక భారత చరిత్రలో అత్యంత ఖరీదైన కళాకృతిగా ఇది రికార్డు సృష్టించింది. ప్రముఖ ఆర్టిస్ట్ అమృతా షెర్గిల్ 1937లో గీసిన 'ది స్టోరీ టెల్లర్' పెయింటింగ్‌ను 2023లో వేలం వేయగారూ.61.8కోట్ల ధర పలికింది. అత్యంత ఖరీదైన భారతీయ కళాకృతిగా ఇప్పటివరకు ఇదే కొనసాగగా.. తాజాగా ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ దీని కంటే రెట్టింపు ధర పలకడం విశేషం. ఎంఎఫ్ హుస్సేన్ కుంచె నుంచి జాలువారిన 'గ్రామ్ యాత్ర' ఒకే కాన్వాస్‌లో 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకొంది. కళాఖండం కొత్త రికార్డు సృష్టించడంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందని వేలం సంస్థ క్రిస్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఇదో విష వలయం.. అప్పులు కట్టడానికే మళ్లీ అప్పులు




**విశ్వంభర హైదరాబాద్:** ఏటేటా అప్పులు గణనీయంగా పెరుగుతున్నాయని, రాష్ట్ర ఆవిర్భావం నుంచి భారీగా పెరుగుతూ వచ్చిన రుణాలు (బడ్జెట్, బడ్జెటేతర కలిపి) ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి రూ.7,38,707 కోట్లకు చేరాయని తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక-2025 పేర్కొంది. పెరుగుతున్న రుణభారం రాష్ట్ర ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా వాటిని చెల్లించడానికే మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఇదో విష వలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొనే రోజులు కూడా గణనీయంగా పెరిగాయని.. 2017-18లో ఐదు రోజులు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొంటే, 2023-24లో అది 121 రోజులకు చేరిందని నివేదిక పేర్కొంది.

**నివేదికలోని ముఖ్యాంశాలు ఇవీ..**కాగ్ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై అధ్యయనం చేసిన 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకొంటే రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపుల వాటా చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం తెలంగాణ రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపుల వాటా 14.2 శాతం. ఇది జాతీయ సరాసరి 12.7 శాతం కంటే ఎక్కువ. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, గుజరాత్ రాష్ట్రాల కంటే ఎక్కువ కాగా.. తమిళనాడు కంటే కాస్త తక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల కోసం తిరిగి చెల్లించే మొత్తం 2014-15లో రూ.6,954 కోట్లు ఉండగా, 2023-24 నాటికి రూ.36,686 కోట్లకు పెరిగిందని, బడ్జెటేతర రుణాలనూ పరిగణనలోకి తీసుకొంటే 2014-15లో రూ.7,254 కోట్లు ఉండగా 2023-24 నాటికి రూ.61,691 కోట్లకు చేరినట్లు తెలిపింది. దీనికి కారణం స్పెషల్ పర్పస్ వెహికల్స్(ఎస్.పి.వి.) ఏర్పాటు చేసి ప్రభుత్వ గ్యారంటీలతో రుణాలు తీసుకోవడమని పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక రంగ ఆరోగ్య పరిస్థితికి సొంత ఆదాయంలో వడ్డీ చెల్లింపులు ఎంత అన్నది కీలకమని.. ఈ రేషియో 2014-15లో 14.6 శాతం ఉండగా, 2023-24 నాటికి 18 శాతానికి పెరిగిందని, బడ్జెటేతర రుణాలనూ పరిగణనలోకి తీసుకొంటే వడ్డీల భారం 15.1 శాతం నుంచి 28.2 శాతానికి పెరిగిందని వెల్లడించింది. వడ్డీలకే ఎక్కువగా చెల్లించడం వల్ల అత్యవసర సర్వీసులు, అభివృద్ధిపై ప్రభావం పడుతోందని నివేదిక తెలిపింది.

బీజేపి ఎంపీ ఈటల రాజేందర్‌కు జన్మదిన వేడుకలు ఘనంగ జరుపుకుంటున్న బీజేపీ నాయకులు





బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జీజేపీ ఎంపీ దర్మపురి అరవింద్